# పెళ్ళికూతుళ్ళు అమ్మబడును

-ఎమ్. సి. ఆంజనేయులు

చాలా సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన-

కడప పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ డివిజన్ ఆఫీసులో, ఆ రోజే చేరాడు, పాండురంగారావ్ అనే టైపిస్టు. రోడ్లు, భవనాలు, నీటి పారుదల ఇత్యాది శాఖలన్నీ అప్పుడు పి.డబ్ల్యు.డి. కిందే ఉండేవి.

హెడ్ డ్రాఫ్ట్స్‌మన్ విశ్వనాథం (నిత్యం తాంబూళ సేవనంలో ఉంటే ఈయన్ని బాగా ఎరిగినవారు, తుంపర్ల విశ్వనాథం సారువాడు అని సరదాగా రెఫర్ చేసేవారు) పాండురంగారావుని పిల్చి, రహదార్లకి సంబంధించిన ఒక టెండర్ నోటిఫికేషన్ వ్రాత ప్రతిని యిచ్చి, "నీట్‌గా టైప్ చేసి త్వరగా తీసుకరా..." అంటూ, ఆర్డర్ జారీచేశాడు.

ఆ రోజే ఆఫీసులో చేరిన పాండురంగారావుకి టెండర్ నోటిఫికేషన్ అంటే ఏమిటో తెలియదు. సీటు చేరుకున్నాక వ్రాత ప్రతి నొకమారు- పైకీ కిందకీ చదివాడు. హెచ్.డి. చిక్కు రాతను అర్థం చేసుకోవడం, పదాలు విడదీయడం, చాలా కష్టమైంది పాండురంగారావుకి. ఏమైతేనేం- ఓ గంట నానా తంటాలు పడి, నోటిఫికేషన్ టైప్‌చేసి, దాన్ని తీసికెళ్ళి హెచ్.డి. విశ్వనాథం గారికి సమర్పించాడు.

తన నోట్లోంచి ఉమ్మి తుంపరులు విసురుగా వచ్చి టైపిస్టు ముఖాన్ని అభిషేకిస్తుండగా, టైప్డ్ మ్యాటర్ని బిగ్గరగా చదివిన విశ్వనాథం పడీ పడీ నవ్వుతూ యిలా అన్నాడు:

"ఏమిటయ్యా, ఈ పెళ్ళి కూతుళ్ళ ప్రకటన!! "ఏ" క్లాసు బ్రైడ్ 70 లక్షల రూపాయలు, "బి" క్లాస్ బ్రైడ్ 30 లక్షల రూపాయలు - ఏమిటి ఈ "ఏ" క్లాసు, "బి" క్లాసు పెళ్ళికూతుళ్ళు. మనదేమైనా పెళ్ళికూతుళ్ళ బ్యూరో అనుకున్నావా - నువ్వు? బ్రిడ్జ్ (Bridge) అని టైప్‌చేసే బదులు, బ్రిడ్జిలోని 'జ' ఎగరగొట్టి బ్రైడ్ (Bride) అని టైప్ చేశావు. ఇది ఇలాగే పత్రికలకి వెళ్ళిపోయి వుంటే- మనిద్దరం ఇళ్ళకి వెళ్ళిపోయి ఉండే వాళ్ళం. ఈ నోటిఫికేషన్ రహదారుల కడ్డంగా కట్టే వంతెనలకు (Bridges) సంబంధించిన నోటిఫికేషన్. తెలిసిందా...? ఈ కడపటి లైను చూడు- మరీ ఘోరంగా టైప్ చేశావు. బిడ్స్ చేరేందుకు కడపటి తేదీ (Last date for receipt of bids) అని టైప్ చేసే బదులు లాస్ట్ డేట్ ఫర్ రిసీట్ ఆఫ్ బిడ్డలు అని టైప్ చేశావు. బిడ్స్ అంటే బిడ్డకు బహువచనం- బిడ్డలు కాదయ్యా మహానుభావా! బిడ్స్ అంటే ఇంగ్లీషులో 'టెండర్లు' అని అర్థం. నేనిక్కడే గూటమేసుకొని కూచుని ఉన్నానుగా. తెలీకపోతే వచ్చి నన్నడగొచ్చు కదయ్యా!"

హెడ్.డి. వేసిన అక్షింతలకి తల బొప్పి కట్టింది పాండురంగారావుకి. "సారీ సార్! సరిచేసి తెస్తాను..." అంటూ టెండర్ నోటిఫికేషన్ విశ్వనాథం చేతుల్లోంచి లాక్కొని తన సీటుకేసి పరుగు తీశాడు పాండురంగారావు.

"రంగ...రంగా! పాండురంగా! తప్పులు కొట్టి చంపకయ్యా!" అంటూ, పాన్‌దాన్‌లోకి చెయ్యి దూర్చాడు విశ్వనాథం. ■

## మెరుపులు-తళుకులు

నా హృదిలో ఆరని జ్యోతివి నీవే!
నా మదిలో వాడని ప్రేయసి నీవే
నా మనసు నింగిలో మెరిసే / నక్షత్రం నీవే!
నీ సొగసుల గొలుసుల్లో / నీ ఊపుల వయ్యారాల్లో
నీ ఒంపుల్ సొంపుల్
నా కనులకు చేస్తున్నవి
'విందుల్ - పసందుల్'
నీ మేని మెరుపుదనాలు
నీ చూపులకు నా మనస్సు
అయస్కాంతాలు!

## లోకం తీరు

లోకం తీరు - బతుకే జోరు!
అన్నాదమ్ముల అప్పుల పోరు
దేశంలో వ్యభిచారాలెన్నో జోరు
సంసారంలో చింతలెన్నో జోరు
దేశంలో మోసాలు- చోరుల జోరు
కలానికి కాలానికి బతకడమే పోరు
నానాటికి దుర్భర స్థితియే బోరు
అందుకేనేమో... / దేశ ప్రగతి - అయోమయం
అంతరాలలో అలజడి / తీరు-జోరు!

-అనంత ప్రభాకర్‌దత్తు